| | |
|---|---|
| **శ్రీ రమణ జ్యోతి** | **Sri Ramana Jyothi** |
| అక్టోబర్ 2022 | October 2022 |
| ఈ సంచికలో ... | IN THIS ISSUE ... |


| | | | |
|---|---|---|---|
| **1.** | **డా॥ కే.యస్. గారి 99వ ప్రవచనం** | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| **2.** | **శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము** | తాడిమేటి సత్యనారాయణ | 12 |
| **3.** | **శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్)** | జి. శ్రీహరిరావు | 21 |
| **4.** | **అనుస్మరణీయులు (శ్రీ అయ్యల సోమయాజుల వెంకట రమణ)** | అ. రేణుక | 23 |
| 5. | Diseased Mind and Body | Dr K Subrahmanian | 30 |
| 6. | Ashtavakra Gita - 5 | V Krithivasan | 37 |
| 7. | Curious Case of Bhagavan's Picture | Swagat Patnaik | 42 |
| 8. | Chadwick | NRS Manian | 46 |
| 9. | The Human Dimension of Sri Bhagavan | G Sri Hari Rao | 49 |


## Events in Sri Ramana Kendram in October 2022

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.
3. 17th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.



**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**

**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# గురు వచనం

డా॥ కే.యస్. గారి 99వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

మనకు పలు విషయాల గురించి అనుమానాలు వస్తుంటాయి. మొదట 'ప్రశ్నోత్తర మాలిక' సంస్కృతంలో రచించ బడింది. శిష్యుడు ప్రశ్నలు అడిగితే గురువు జవాబు చెబుతాడు. మొదటి ప్రశ్న "కిం ఉపదేయం? దేనిని గ్రహించాలి? దేనిని వదలి పెట్టాలి? జవాబు "గురు వచనం". గురు వచనమంటే, గురువు చెప్పే మాటలు - గురువు చెప్పిన దానిని ఏ అనుమానం లేకుండ అంగీకరించాలి. ఎందుకంటే గురువు చెప్పేది ఏదైనా మన శ్రేయస్సుకే అయి వుంటుంది. అందులో ఆయనకు ఏ స్వార్థపరత్వమూ వుండదు. మీ మీద దయతో ఏన్నో విషయాలను బోధిస్తారు. వాటిని ఉపేక్షించ కూడదు. గురువాక్యము అతి ప్రధానం.

## శిష్యునిపై శ్రద్ధ

మీ తల్లి కంటే గురువు మీ గురించి ఎక్కువ శ్రద్ధ వహిస్తాడు, అని గుర్తుంచుకోవాలి. మీ ఆరోగ్యం, శారీరక అవసరాలను గురించి తల్లి శ్రద్ధ చూపుతుంది. మీకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఇస్తుంది. గురువు మీ ఆధ్యాత్మిక పెరుగుదల, వికాసం గురించి శ్రద్ధ తీసుకుంటాడు. మీ మనసు శుద్ధమైనదా కాదా అని గమనిస్తూ

వుంటాడు. నీవు మంచి వ్యక్తిగా వుండడానికి దోహదపడతాడు. నీలో జ్ఞానము, వైరాగ్యాలను అభివృద్ధి అయ్యేలాగ చూస్తాడు. జ్ఞాన, వైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాందేహీ చ పార్వతి - మనం ప్రార్థిస్తాము. జ్ఞానం లభించినప్పుడు మరింకేమీ అక్కర లేదు. వైరాగ్యం అలవడితే, ఇక కోరికలు ఏవీ వుండవు, దేనిపట్ల ప్రత్యేక అభిమానమూ వుండదు. కాశీలో అన్నపూర్ణ మాతను శంకరాచార్యులు, మామూలు ఆహారం కాదు, జ్ఞానం, వైరాగ్యాలను భిక్ష కోరాడు.

ఉన్నదానితో తృప్తి చెంది, అది దైవ కటాక్షంతో లభించిందని గ్రహిస్తే, ఇతర కోరికలు లేకుండినప్పుడు వ్యక్తి ఎంతో ఆనందంగా వుండగలడు, అంతేగాని రాజు, ప్రధానమంత్రి హోదాలు, సుఖ సంతోషాలను యివ్వలేవు. కోట్లకొద్ది ఆస్తి వున్న భాగ్యవంతుడు కూడ, మరింత కావాలని కోరుకుంటే, తృప్తి లేకుండ బాధపడుతూనే వుంటాడు. ఇంకా ప్రక్క రాజ్యాలను జయించి విస్తరింపగోరే రాజుకు ఏమి సుఖం వుంటుంది? వైరాగ్యం ప్రదర్శించి తృప్తి చెందిన వ్యక్తి అందరికంటే సుఖ పురుషుడు. వైరాగ్యంతో జ్ఞానం అబ్బుతుంది.

మంచి, చెడుల మధ్య భేదాన్ని గుర్తించడం తెలిస్తే వైరాగ్యం అబ్బుతుంది. కాని అది గ్రహించడం ఎలాగ? దానికి గురుకృప అవసరం. ఇతరులు మూర్ఖుడివని అనుకోవచ్చు. కాని గురువు అనుగ్రహం లభిస్తే, అంతగా తెలివిలేని వ్యక్తి కూడ అతి

తొందరలోనే మేధావంతుడిగా మారవచ్చు. శంకరాచార్యుల శిష్యులలో ఒకరు మందబుద్ధిగా వుండేవాడు. ఆచార్యులు ఒక నిర్ణీత సమయానికి బోధన ప్రారంభించేవారు. ఒక రోజున అతను రావడం ఆలస్యమైంది. అక్కడ ఉన్న శిష్యులలో ఒకరు ఆ రోజు పాఠాన్ని మొదలుపెట్టమని కోరాడు. ఆచార్యులు ''నేను పద్మపాదుడు వచ్చాక మొదలు పెడతానని అన్నాడు. గురువుగారూ! అతని కోసం కాచుకొనడం దండగ. అతనికి చెప్పినా, ఆ గోడకు చెప్పినా ఒకటే. అతను దద్దమ్మ, మీరు కానివ్వండి'' అని తొందర పెట్టాడు.

## గురువు గుర్తిస్తాడు

కాని, శంకరులు అప్పటికీ రాని శిష్యుని కోసం కాచుకున్నారు. పద్మపాదుడు (అప్పటికి ఆ పేరుతో పిలువబడలేదు) గురువుగారి గురించి ఎంతో శ్రద్ధ తీసుకునేవాడు. ఆచార్యుని వస్త్రాలు ఉతకడం వండడం వగైరా పనులెన్నో చేసేవాడు. ఆ శిష్యుడిని ఎగతాళి చేసి నవ్వడం చూసి గురువు చాలా బాధపడ్డాడు. నీ గురించి గురువు అంత శ్రద్ధ, అభిమానం చూపడం అంటే అంత కంటే ముఖ్యమైనది మరొకటి లేదు.

కొన్ని నిముషాల తరువాత, శిష్యుడు పరుగెత్తుకొంటూ వస్తూ వస్తూనే గురువును శ్లాఘిస్తూ, తోటక వృత్తంలో శ్లోకాలను చదివాడు: విదితాఖిల శాస్త్ర సుధాజలధే.... మూర్ఖుడని అందరూ ముద్ర వేసిన శిష్యుడు అలాంటి అద్భుతమైన శ్లోకాలను అంత కష్టమైన

ఛందస్సులో పఠిస్తుంటే, ఇతర శిష్యులందరు తెల్లబోయారు. ఇప్పటికీ, కంచి లేదా శృంగేరి పీఠాలకు చెందిన శంకరాచార్యుల వారు, ఇతర చోట్ల పర్యటనకు వచ్చినప్పుడు, శ్రీ ఆదిశంకరులను కీర్తిస్తూ ఈ శ్లోకాలను చదివి స్వాగతం పలుకుతారు.

మందమతి అయిన శిష్యుడు అంతటి పాండిత్యం చూపడం యిప్పటికీ ఎంతో మెచ్చుకొనబడుతోంది. ఇతర శిష్యుల సంగతి అంతగా తెలియదు. ఆ శిష్యుడు గురువుకు పూర్తిగా అంకితం అయ్యాడు, ఆరాధించేవాడు. ఒక సందర్భంలో నది అవతలి గట్టున ఉన్న శంకరాచార్యులను చేరాల్సి వచ్చింది. గురువు మీద తనకున్న గాఢమైన విశ్వాసం, గురువునే తలుస్తూ భక్తితో అతను నీటిపై వరుసగా తేలుతున్న పద్మాలపై పాదాలను పెడుతూ నడిచి నదిని దాటాడు. అందుకే అతనికి 'పద్మపాదుడు' అని పేరు వచ్చింది.

కిం ఉపదేయం? గురువచనం. గురువు ఏమి చేయగలడు - ఏమి చేస్తున్నాడు అన్నది మన పరిమితమైన మనసుతో అవగాహన చేసుకోలేము. గురువు కూడ ఒక సాధారణ మానవుడు అని భావిస్తాము. కాదు. మానవాకారాన్ని దాల్చిన శుద్ధ చైతన్యం. గురువు చూపే మార్గాన్ని అనుసరించాలి. అశ్రద్ధ చేయరాదని శంకరులు అంటారు. గురువు ఏమి చేయగలడన్నది మనకు తెలియదు. మన దృష్టికి రాకుండగనే ఆయన మనకు ఎన్నో చేస్తాడు, మన నుండి ఏమీ ఆశించడు.

అవ్యాజకరుణామూర్తి రజ్ఞానధ్వాంతదీపికా - ఇది లలితా సహస్రనామ స్తోత్రానికి కొంచెమించు చివరలో వుంటుంది. అవ్యాజ

కరుణామూర్తి - కారణం ఏమీ లేకుండగనే అమ్మ మనకు అంతులేని కరుణను చూపిస్తుంది. సాధారణంగా మనకు ఏదైనా మంచిని చేసిన వాళ్ళకు మనం శుభం చేస్తాము. అమ్మవారు అలాగ కాదు. కరుణను చూపడం అమ్మవారి స్వభావం మనం అనుకున్నట్లుగా కాకపోయినా, మనకు శుభం జరిగే విధంగా ఆమె సంకల్పిస్తుంది.

## సమయానికి తెలియవస్తుంది

హేయం అపి కిమ్? నేను వదలపెట్టవలసింది ఏమి? ఏది చేయకూడదు? అకార్యం. నిషేధించబడినది. ఏదీ చేయరాదు. శాస్త్రం వద్దన్నది చేయరాదు. చిన్నతనంలో, మనల్ని చేయవద్దన్నది ఎందుకు చేయరాదని ప్రశ్నిస్తాము. హేతుబద్ధంగా ఆలోచిస్తామను కొని, అలాంటి ప్రశ్నలు వేస్తాము. దేవుడంటూ ఎవరూ లేదని, అలాంటి నమ్మకం లేదని వాదిస్తాము. వయసు వచ్చే కొద్దీ, మనకంటే ఒక గొప్ప శక్తి వుందని తెలిసివస్తుంది. అది ఎలా జరుగుతుంది? నిస్సహాయులైనప్పుడు, ప్రతిదీ మన అదుపులో వుండదని గుర్తించినప్పుడు తెలుస్తుంది. నిత్యమూ ఉపయోగించ డానికి పలు పరికరాలు వున్నప్పటికి, వాటి మీద అదుపు లేదని కూడ తెలుస్తుంది.

ఇటీవలి వరకు, ప్రకృతిని నియంత్రించగలనని మనిషి అనుకునేవాడు. కాగితం తయారీ, యితర అవసరాల కోసం అడవులను నాశనం చేసి, చెట్లను నరికేశాడు. ఎంతో కాలం

తరువాత, ఎందుకు వానలు సరిగా పడడం లేదని చింతించాడు. ఇప్పుడు చెట్లను ధ్వంసం చేసినందుకు ఇలా జరుగుతోందని తెలుసుకున్నాడు. వాతావరణాన్ని కలుషితం చేయరాదని గ్రహించి ఎంతో ఖర్చుపెట్టి సరిదిద్దుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు.

మన తోటలో తిరుగుతున్న చీమను చూసినప్పుడు దానిని చంపగలమనుకుంటాము. కాని దాన్ని సృష్టించగలమా? అలాగ ఎన్నో కోట్లానుకోట్ల చిన్న పురుగులు, బ్యాక్టీరియా, వున్నాయి. ఈ ప్రపంచంలోని ప్రతి జీవి ఉనికికి ఒక కారణం వుంటుంది. మనమేదో వాటికంటే గొప్ప వారం అనుకోవడం పొరబాటు. ఈ విశాల విశ్వంలో అన్నిటికీ ఒక స్థానం వుంది.

## మొక్కలూ ప్రతిస్పందిస్తాయి

ఒక మొక్కను ప్రేమతో పెంచితే, అది మన పట్ల ప్రతిస్పందన చూపిస్తుందని రష్యన్ దేశస్థులు కనుగొన్నారు. మనకేమైన జరిగితే దానిలో మార్పు కనిపిస్తుంది. అలాగే మనం పెంచిన మొక్కకు రోజూ నీళ్ళు పోస్తూ, తరువాత ఎక్కడో దూర ప్రదేశానికి వెళ్ళి అక్కడ ఏ ఆపదకు గురి అయితే యితరులు సరిగా నీళ్ళు పోస్తున్నప్పటికీ, కృశించి సరిగా పెరగదు.

నేను 'సీఫెల్' ఆఫీస్ ప్రాంగణంలో నివసిస్తున్నప్పుడు కొన్ని మామిడి టెంకలు నాటితే అవి పెద్ద వృక్షాలుగా పెరిగాయి. ప్రతి ఏడూ మంచి కాపు వచ్చేది. మేము అక్కడి నుండి కదలి వేరొక చోటికి మారిన తరువాత, ఒక ఏడాది పాటు ఫలాలను ఇవ్వలేదని,

తోటకాపరి చెప్పాడు. ఇలాంటి సంఘటనలకు మన జవాబు ఏముంటుంది? ఈ ప్రపంచం గురించి మనకు తెలిసినది చాలా, చాలా తక్కువ.

**జడపదార్థాలు కావు**

మనం సాహిత్యాన్ని గమనిస్తే మన మునులు, ఋషులు, మనం జడపదార్థాలుగా భావించే వాటి పట్ల, ఎంతో ప్రేమను చూపేవారు. 'శకుంతల' నాటకంలో కణ్వుడు శకుంతలతో ఎంతో బాధతో ''నీవు ఈ చెట్లకు రోజూ నీళ్ళు పోసే దానిని. రేపు వెళ్ళిపోతున్నావు. ఇక అవి పెరుగుతాయో లేదో, నీవెంతో ప్రేమతో వాటిని చూసుకునే దానివి. వాటికి 'ఏమౌతుందో'' అని అన్నాడు. ''పువ్వులను, ఆకులను అవసరంగా కోయకండి. చెట్టకు బాధ వేస్తుంది'' అని భగవాన్ అనేవారు.

ఒకసారి ఎవరో ఆయనతో ''నేను లక్షార్చన చేద్దామను కొంటున్నాను. ఇంకా కొన్నివేల పువ్వులు కావాలి'' అంటే ''ఉన్నవాటితో సర్దుకోవచ్చు కదా! లేకుంటే తక్కువ పడిన వాటికి బదులు నిన్ను గిల్లుకోమని అన్నారట. ''నాకు నొప్పి పుడుతుంది ''అంటే'' వాటికీ అంతే జరుగుతుంది. ఏదో నామమాత్రంగా తీసుకోవాలి చెట్టుకు బాధ కలిగించకు'' అని బదులిచ్చారు.

శ్రీకృష్ణుడు తనకు ఏదో పత్రం, పుష్పం, ఫలం, తోయం ఇస్తే చాలు. గొప్పగా మరేమీ ఇవ్వాల్సిన పనిలేదని అనేవాడు - ఒక ఆకు, ఒక పువ్వు, కొంచెం నీరు చాలునన్నాడన్న మాట. మిగతవేమీ

లేకున్నా నీరు చాలు. ఇంతకూ దేవునికి మనం ఏమివ్వగలం? ఏమీ లేదు. ఆయనకు స్వంతమైనదే ఆయనకు సమర్పిస్తాము. చాలా కాలంగా నేనూ ఇదే చెబుతున్నా. వేంకటేశ్వరస్వామి హుండీలో రెండు కోట్లు వేసినప్పటికీ, ఆయన సొమ్ము ఆయనకు ఇస్తున్నామని గుర్తించాలి. 'శ్రద్ధయాదేయం; అశ్రద్ధయా అదేయం. ఎవరికైనా పదిపైసలిచ్చినప్పటికీ శ్రద్ధతో యివ్వాలి. మనుష్యులకే కాదు, పశు, పక్ష్యాదులు, మొక్కలు, చెట్లు అన్నిటి పట్ల ఒకే భావం చూపాలి.

అమెరికాలో నివసిస్తున్న ఒక వ్యక్తి జర్మనీకి వెళ్ళపోదలచాడు. రెండు, మూడేళ్ళగా అతనికి ఒక పెంపుడు కుక్క వుండేది, యజమాని అంటే బహు ప్రేమ. కాని అతను కుక్కను తనతో తీసుకుపోదలచుకోలేదు. విమానాశ్రయం దగ్గర కుక్కను వదిలేసి, జర్మనీ వెళ్ళిపోయాడు. వెళ్తూ వెళ్తూ, విమానాశ్రయంలో ఒక అధికారికి తన జర్మనీ అడ్రెస్ యిచ్చి, నేను ఈ కుక్కను ఇక్కడే వదిలేస్తున్నానని చెప్పాడు.

యజమాని విమానం ఎక్కి వెళ్ళడం చూసిన కుక్క ఆ తరువాత అక్కడే వుంటూ వచ్చింది. ఆహారం కూడ తీసుకోకుండ యజమాని కోసం కాచుకు కూచుంది. ఈ విషయం గమనించిన విమానాశ్రయ అధికారి, కుక్క స్వంతదారి జర్మనీ అడ్రెస్‌కు ఫోన్ చేసి విషయం తెలిపాడు. వెంటనే ఆ స్వంతదారు తిరిగి వచ్చి కుక్కను వెంటతీసుకుని వెళ్ళిపోయాడు. ఇలాంటి కథలు ఎన్నైనా వున్నాయి.

## కృతజ్ఞతా భావం

వేము విద్యానగర్‌లో వుంటున్నప్పుడు, రోజూ నేను ఇంజనీరింగ్ కాలేజీ దాకా నడిచి వెళ్ళి, అక్కడ బస్సు ఎక్కి ఆఫీసుకు వెళ్ళే వాడిని. ఒకరోజు రోడ్డు మీద ప్రమాదంలో గాయపడిన కుక్క బాధపడుతుంటే, ఇంటికి తీసుకెళ్ళాను. చికిత్స చేయించి ఇంటి దగ్గరే వుంచుకున్నాము. నేను ఆఫీసుకు బయలుదేరే సమయానికి ప్రతిరోజూ నాతో కూడ నడిచి వచ్చి, నేను బస్సు ఎక్కిన తరువాత తిరిగి ఇంటికి వెళ్ళేది. కొంతకాలం తరువాత అది వేరుగా వుండగలదని, కారులో తీసుకెళ్ళి నాలుగైదు మైళ్ళ దూరంలో వదిలి వచ్చాము. కాని సాయంత్రానికి ఇంటికి తిరిగివచ్చింది!

ఈ ప్రపంచంలో మనమేదో చాలా ముఖ్యమైన వాళ్ళమని అనుకుంటాం. దేవుడు మనల్ని మాత్రమే జాగ్రత్తగా చూసుకోవాలని అనుకుంటాము. కాని దేవుడు ప్రజల్ని అందరినీ జీవకోటిని కాపాడ వలసి వుంది. పెద్దవాళ్ళమయ్యే కొద్ది మన దుడుకుతనం, గర్వము తగ్గి, మనం కేవలం దేవుని చేతిలో పనిముట్టు మాత్రమేనని తెలుసు కుంటాం. పరిస్థితిని బట్టి నడవడం తెలుసుకుంటాం. క్రమేపీ అన్నీ భగవంతుని ఇచ్ఛప్రకారమే నడుస్తాయని గ్రహిస్తాము. మానవ రూపంలో ఉన్న గురువును అవసరించితే, తగిన సమయంలో అవసరమైతే ఆయన మనకు మార్గాన్ని నిర్దేశిస్తాడు.

* * * *

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) తాడిమేటి సత్యనారాయణ

## 15వ పద్య తాత్పర్యము

షట్చక్రములు, పది రకముల నాదములను వినిపించు నాడులు, ఆధార చక్రముల మధ్యలో అనేక రకములైన రేకులు గల తామరలలో అధిష్ఠించు, వినాయకుడు మొదలగు దేవతలు, వాటికైన మంత్రాక్షరములు, సూర్యమండలము, చంద్ర మండలము, అగ్ని మండలములు ఆదిగా గల, అనేక రకములుగా విస్తరించిన మూర్తి భేదములన్నియు సూటిమార్గమైన కాలోత్తర మార్గమును వదిలివేసి, ఏ రోజు (ఎప్పుడును) స్మరింప కూడనివి, తగనివి.

వ్యాఖ్య: ముక్తికొరకు సూటి మార్గముగ ఉపదేశించబడిన ఈ మార్గమును వదలి, వేరే మార్గములోనికీ సాధకుడు వెళ్ళ కూడదని గట్టిగా నొక్కి చెప్పి తరించుటకు ఇదే ఉత్తమ సాధనమగునని వివరించుచున్నారు.

ఆధారచక్రములలో తోచు దేవతలను ఉపాసించునపుడు, ఒక్కొక్క చక్రము నందు దానికి గల మూర్తిని ప్రతిష్ఠించి, దానికి తగ్గ మంత్రాక్షరమును వల్లెవేసి, ఆ మూర్తి యొక్క సిద్ధిని పొంద వలెను. తర్వాత ఆ విధముగనే అటుపైన గల ఒక్కొక్క మూర్తులను ఉపాసించి సిద్ధులను పొందవలెను. ఇట్లు ఆరు ఆధారచక్రముల మూర్తులను ఉపాసించి సిద్ధులను పొందునపుడు, సిద్ధి పొందిన దానిని వదలుట, పొందవలసిన దానిని ఉపాసించుట, అని

సాధకుడు, వదలలేక విశ్రాంతి లేక వృత్తులను చేసి అలసిపోవు చున్నాడు.

ఈ విధముగనే కొందరు యోగులు, ఎంతో కాలము శ్రమించిన ఫలితముగా, పది రకముల నాదములను రేకెత్తించగల ధ్వనులను నాడులలో నిబంధనము చేయుదురు. ఇందు సిద్ధి పొందుటకు తగిన గురువు వద్ద నిద్రాహార నియమాలతో దీర్ఘకాలము అభ్యసించి పొందవలెను. అట్లు పొందిన యోగులు, ప్రణవము, దేవీ బీజాక్షరమైన హ్రీంకారము, ఇటువంటి దశవిధము లైన నాదములనూ, వాటికి చెందిన నాడులను రేకెత్తించెదరు. ఇదొక విచిత్రమైన భ్రమలను కల్పించు ఉపాసనయగును. ఈ విధముగనే మూడు మండలములలో గల మూర్తులను ఉపాసించి విజయము పొందుచున్నారు.

అయితే పైన తెల్పినవన్నియు మోక్షానందమును ఇవ్వగలవి కావు. అందుచే సాధకుడు వాటిని ఎప్పుడును తలచకూడదు. వ్యవహార లోకములో కొంతమంది అద్భుతమైన లీలలు చేసి, మనుష్యులను భ్రమింప చేయుదురు. అటువంటిదే యిదియునూ కూడా. సాధకుని సాధనలో ప్రతిబంధకములుగా వచ్చు ఈ మూర్తులను ఎప్పుడూ ఉపాసించకూడదు. దేవతలను (మూర్తు లను) ఒక్కొక్క ఆధారములలో ధ్యానించి పిమ్మట వాటిని వదలి మరొక పై ఆధారమునకు పోవునప్పుడు దుఃఖముగాను, ఒక్కొక్క దేవతను సృష్టించి, తిరిగి వధించుట (నిరుపయోగము చేయుట)ను మహా పాపమనియు జ్ఞానులు తలచుచున్నారు. తమను సృష్టించి

పోషించి హరించు దేవతలను, సృష్టించి వధించుట ఘోరమైన పాపమని భావించుచున్నారు.

బాహ్య ప్రపంచములో చేయు వృత్తులవలె, అంతర్గతముగ చేయు వృత్తులు కూడా దుఃఖమును కలుగచేయుచున్నవి. అందు వల్ల వీటిని ఎప్పుడూ కొంచెమైనను ఆలోచించకూడదు, అని బోధించుచున్నారు.

పైగా పైన తెలిపిన మార్గమునందు ఎప్పుడును గురుభక్తితోనే యుండవలయును. లేనిచో అనేక కష్టములు కలుగవచ్చును. సూటిమార్గమైన ఇందు నిర్భయముగా పోవచ్చును. సాధకుని వాసనలచే కొంతకాలము ఆలస్యమైనను భయములేని, సులభమైన మార్గము.

**16వ పద్య తాత్పర్యము**

అనేక విధములైన ఉపాసనలకు తగిన మంత్రగణము, ప్రాణ చలనమును కట్టుబాటు చేయు స్తంభనము ఇత్యాదులు, కుంభకము మొదలగు ప్రాణాయామమునకు చెందిన ధారణలు మొదలగు నవన్నియునూ, అక్షయమగు ముక్తిని పొందగోరువారు, ప్రయత్నించి అనుష్ఠించవలసిన అవసరము లేదు.

**వ్యాఖ్య**

కేవలము మోక్షమే కావలెననెడు యిచ్ఛగల తీవ్ర ముముక్షువులు, పైన చెప్పిన ఏ ఒక్కటిని ఆచరించ నవసరము లేదని స్పష్టముగా చెప్పుచున్నారు. మనస్సు మంత్రమును జపించుచూ చాలాకాలము ఉండునేగాని నాశమవదు. అందుచే

మంత్రగణములు ముక్తికి సహాయపడవు. ఆదిలో మంత్రములు అనేక కోట్లున్ననూ కాలక్రమేణ మరుగై, ప్రస్తుతము ఉపదేశమున కున్నవి కొన్ని మాత్రమే. ఇవియే మంత్రగణమని చెప్పబడినవి.

ప్రాణచలనమును ప్రాణాయామముచే నిరోధించునపుడు దానితో మనస్సు కూడా అణగిపోవును. ప్రాణము ఎంతసేపు నిరోధింపబడుచున్నదో, అంతసేపు మనస్సు కూడా స్తంభించును. ప్రాణములేచిన మనస్సును లేచును. ఇందువల్ల మనోలయమే తప్ప, మనోనాశమగుట లేదు. మనోనాశము చేతనే ముక్తి సిద్ధించును. అందువలన ఇదియును ముక్తిని పొందనీయదు. ముక్తి పొందుటకు సూటి సాధనములు కాని వీటిని అనుష్ఠించుటచే ఎటువంటి లాభము లేదు. అందుచే వీటిని చేయుటకు ప్రయత్నించవద్దని చెప్పబడుచున్నది. ముక్తిని కోరువారు మనోనాశము పొందవలెను. ధారణయెా, ఉపాసనో, మంత్రోచ్చారణమో ఏదైనప్పటికిని మనస్సుతోనే చేయవలెను.

మనము కోరునది మనస్సు లేని ముక్తిని. అయితే మనము అనుష్ఠించు కార్యములు మనస్సును మరింత గట్టిపడునట్లు చేయును. ఒకదానికొకటి విరుద్ధమైన యివి, అనుసరించుటకు తగవు. కనుక వాటిని అనుష్టించవద్దు అని హెచ్చరించుచున్నారు.

## 17వ పద్య తాత్పర్యము

నేను చెప్పునది శ్రద్ధతో వినుము : వేదములచే స్తుతింపబడు పరవస్తువు, కేవలము జ్ఞానముచేతనే తెలిసికొన దగినదని

గ్రహింపుము. కనుక ఇక కొంచెమైననూ తనకు అన్యముగా ఆ పరవస్తువును తెలుసుకోనక్కరలేదు కనుక, ఆ పరవస్తువును గురించి చేయబడు దేవతా పూజలో, స్తుతించి నమస్కరించుటయో, పవిత్రమైన పంచాక్షర, అష్టాక్షర మంత్రములను విడవకుండా జపించుటయో, దేవతారూపములను మనసులో ధ్యానించుటయో అచ్చట లేదు.

**వ్యాఖ్య**

పరవస్తువు కేవల జ్ఞానముతో మాత్రమే తెలుసుకొనగలిగినది. అట్లున్నప్పుడు తనకు అన్యముగా అపరవస్తువును ఎంచి, ఒక దేవతామూర్తిగా ఆహ్వానించి అర్చించి పూజించుటయూ, సూర్యుని గురించి చేయు సూర్యనమస్కారము వంటిదీ, అతి పవిత్రమైన పంచాక్షర, అష్టోత్తర మంత్రములను జపము చేయుట, మూర్తులను ధ్యానించుట వంటి కార్యకలాపముల వల్ల ఫలిత (అవసర) మేమియు లేదని చెప్పుచున్నారు.

ఎందువలననగా వీటిచే దానిని అందుకొనలేము. అన్నిటికి అతీతమైనది ఆ పరవస్తువు. పైగా, చేసే పూజలన్నియు ఏదో ఒక లక్ష్యముతోనే చేయుబడుచున్నవి. ఆ లక్ష్యము మనస్సుచే సంకల్పింపబడుచున్నది. పరమ పురుషుణ్ణి తెలిసికొనుటకు మనోరహితమైన కేవల జ్ఞానముచేతనే వీలగుననుటచే, మనస్సుతో చేసే కర్మలు వాటికి అడ్డంకులేగాని సహాయకారి కాజాలవని భావము.

ఇన్ని రకములైన క్రియా కలాపములు చేసి, తదుపరి నిరుపయోగమని త్రోసివేయుట కంటే, ముందే వాటిని చేయవద్దని చెప్పుట ఒక్క జ్ఞానయోగికి మాత్రమే చెల్లును. ఊడ్చిబయట పారవేయవలసిన చెత్తను లెక్కించటమెందుకు? అని శ్రీభగవానుని ఉపదేశము.

## 18వ పద్య తాత్పర్యము

తనకు అన్యమైన బాహ్యావిషయములను వెంబడించి సదా తిరిగే మనస్సు గలవారికి, బంధములను కలుగచేయు కారణములు ఎప్పుడూ ఏదో ఒకటి పుట్టుచునే యుండును. బహిర్గతమై తిరుగు మనస్సును అంతర్గతము చేసి, తన సహజస్థితిలో లయింపజేసినచో, అట్లు చేసినవాడు ఈ ప్రపంచములో ఎటువంటి దుఃఖములనూ, కలతలనూ చెందడని గ్రహింపుము.

వ్యాఖ్య: మనస్సు తన నిజస్థితిని వదలి బయటికి పోవునప్పుడే, బాహ్య విషయములను పట్టుకొనుచున్నది. బాహ్య విషయములు అస్థిరములగుటచే మనస్సు మారిమారి వేర్వేరు విషయములను పట్టుకొని పరుగెత్తుచున్నది. ఇట్లు పరుగెత్తుటచే మనస్సు వ్యాప్తి నొందుచున్నది. వ్యాప్తి నొందిన మనస్సు చేతనే అనేక విషయము లను గ్రహించవచ్చును. గ్రహించిన వాటిని సేకరించుటయే బంధహేతువగుచున్నది. దేనిని పట్టుకొని తిరుగు చున్నాడో ఆ విషయమునకు సరిపోవునట్లు బంధము కలుగుచున్నది.

దీనిని అరికట్టు విధానము ఒకటే. అది మనస్సును అంతర్ముఖము చేసి, తన నిజస్థితిలో లయమొనర్చుట. నిర్విషయమైన మనస్సు పరమవస్తువుగా భాసించుచున్నది. మనస్సై నపుడు అంతటా పరుగులెత్తినది, బంధములన్ని విడపడగా మౌనముగా నుండిపోవుచున్నది. మనస్సును ఈ స్థితికి తెచ్చినచో, ఇక ఈ ప్రపంచములో ఎట్టి దుఃఖములూ, భీతి, కలవరములు, ఓర్వలేని బాధలు అతనిని అంటవు.

## 19వ పద్య తాత్పర్యము

అంతటా నిండిన పరిపూర్ణ ఏకాత్మ స్వరూపము, లోపల బయట, పైన, క్రింద, మధ్య అను దిక్కులు ఏమియు లేనటువంటిదై, ప్రపంచమున నున్న అన్ని రూపములుగనూ, తనకు ఒక రూపమంటూ లేనిదై (నిరాకారమైన), తన చేతనను తెలిసికొన్నదై, ఇతరుముల ప్రకాశమును ఆశ్రయించక తనకు తానుగానే ప్రకాశించుచున్నది. అటువంటి పరిపూర్ణ ఏకాత్మ స్వరూపమును చేరుదువుగాక!

వ్యాఖ్య: నిజ స్వరూపము అంతటా నిండియున్న వస్తువగుటచే దానికి దిక్కులు అపాదింపలేము. అందుచేత దిక్కులు ఆవరించని దిక్కులు లేని వస్తువగును. కనబడు రూపములన్నీ కన్పించి అదృశ్యమగుటకు తాను కారణభూత మగుటచే తాను నిరాకారమైనది. ఎందువలననగా తాను ఆకారము గల వస్తువైనచో, తాను కాన్పించుటకు రూపములేని

చిదాకాశమును ఆశ్రయించవలెను. అయితే ఆ చిదాకాశము కూడా తనకంటె అన్యము కానిదగుటచే తనకొక రూపము లేనిదగు చున్నది.

అందుచేతనే ప్రపంచమున కనబడు, రూపము లన్నిటికినీ కారణమైయున్న వస్తువు, రూపము లేనిదని చెప్పబడుచున్నది. సద్వస్తువు రూపమున్న దైనచో దేశకాలములకు లోబడిన దగును. సద్వస్తువు దేశకాలములకు అతీతమైనది. అందుచేతనే ఒక రూపమంటు లేనిదని చెప్పబడినది.

ఈ విధముగనే జ్ఞానము, జ్ఞేయము తానే తన్ను తాను తెలిసి కొనునదై యున్నది. ప్రపంచములోనున్న అన్నిటిని ప్రకాశింపచేయు ఆ వస్తువు, తనను ప్రకాశింపచేయుటకు, వేరొక ప్రకాశము అవసరము లేక స్వయంప్రకాశమై వెలుగుచున్నది.

## 20వ పద్య తాత్పర్యము

ప్రపంచములోని జీవులు తాము ఏయే గతి నొందవలెనను ఉద్దేశముతో, కర్మల నాచరించెదరో (వృత్తులను చేసెదరో) ఆ జీవులు, ఆ ఉద్దేశము ప్రకారము ఆ గతులను పొందుచున్నారు. అందుచే దోషములతో కూడిన ఆ వృత్తులను అనుసరించి వాటిని చేయక, తనకు అన్యమైన బహిర్విషయములపై లక్ష్యముంచక మనసును అంతర్ముఖము చేసి నిరాలోకమైన స్వరూపమును (చూపునకు అందని స్వరూపమును) ధ్యానింపుము.

వ్యాఖ్య: ప్రపంచములోని జీవులందరు అనుభవించు గతి, వాటి వల్లనే దానిని పొందవలెననెడు లక్ష్యముతో చేయబడి, దాని ఫలితముగ ఆ గతిని పొంది అనుభవించుచున్నారు. మంచీ చెడూ ఏదైనప్పటికి ఆ జీవులచే చేయబడినవే, ఆ జీవులను చేరి ఫలితముల నిచ్చుచున్నవి. అందుచే ఆ వృత్తి దోషముగలదై యున్నది. దోషరహితమగు ముక్తిని చేరనివ్వదు. కర్మము చేయుట, చేసిన కర్మ ఫలములను అనుభవించుటయూ, ఒక విషవలయము వలె తిరిగి, కర్మసముద్రములో ముంచుతున్నది. అందువల్ల దానిని దోషముతో కూడినదని లేదా దోషయుక్తమని చెప్పుచున్నారు. దోషములగు పనులను చేయుటచే, దోషములు ఇంకనూ పెరుగు చుండును. అందుచే వాటిని చేరవద్దని చెప్పుచున్నారు.

మరియింక ఏమి చేయవలెనను దానిని వివరించుచున్నారు. తనకు అన్యమైన లోక వ్యవహారములన్నియు దోషములే. కనుక వాటిపై లక్ష్యముంచక, మనసును అంతర్ముఖము చేసి చూపునకు అందని స్వరూపమునే ధ్యానించమని చెప్పుచున్నారు. నిరాకార వస్తువును ఉపాసించుటచే ఇతని రూపము నశించుచున్నది. రూపము నశించుటకు ఇదొక ఉపాయము.

“నీ రూపు నెంచక నెంచిన జలధి
యందు చక్కెర బొమ్మ యన రూపుబోవు”

అని శ్రీ భగవాన్ “అరుణాచల అష్టకము” 3వ పద్యములో ఈ భావమునే తెలిపియున్నారని గ్రహింపవలెను. (సశేషం)

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

కాకపోతే, మనందరిలాగానే, శ్రీ భగవాన్‌కు కూడా రుచులన్నీ కూడా చక్కగా తెలిసేవి. వంటల్లో యేమేమి దినుసులను వాడాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. పుస్తకాలు బైండింగులాంటి పనులు చేయడంలో ఆయనకు చాలా నిశితమయిన దృష్టి ఉండేది. ఏ పని కూడా ఆషామాషీగా చేయనిచ్చే వారు కాదు. శ్రీ భగవాన్ చేసినదంతా చాలా చక్కగా చాలా కౌశలంతో చేయబడినట్లు ఉండేది. ప్రతి విషయాన్ని శ్రీ భగవాన్ చాలా జాగ్రత్తగా చూసేవారు. దేనిని నిర్లక్ష్యం చేసే వారు కాదు. ఇవే పరస్పర విరుద్ధంగా కనిపించి నట్లయితే, సహజ నిష్ఠ అనే స్థితి యెలా వుంటుందో మనకు అర్థం అవ్వటం చాలా కష్టం.

ఈ ప్రశ్నకు సంబంధించినదే ఇంకొక సమస్య ఉత్పన్నమవు తుంది.

అందరి జ్ఞానులలాగానే శ్రీ భగవాన్‌కు మనో నాశనము అవటం వల్ల సద్వస్తువు ఒక్కటేయని, ఆ పరమాత్మనొక్కటినే ఎరిగి యెట్టి భేద భావము లేక గాంచునప్పుడు, భక్తునకు భక్తునకూ, లేదా శిష్యునకు, శిష్యునకూ మధ్య తేడాలు యెలా గమనించ గలరు? వారి నెలా కడదేర్చగలరు? ఈ విషయాన్నే శ్రీ భగవాన్‌తో ప్రస్తావించాను. ఆ సందర్భంలో ఇలా అడిగాను: ‘‘నాకూ, ఇతర భక్తులకూ ఒక్క విషయము సుస్పష్టము. మేమెక్కడున్నా, ఎంత

దూరంలో వున్నా, ఏదైనా ఆపదలో వున్నప్పుడు ప్రగాఢమైన భక్తితో మిమ్మల్ని ఆశ్రయిస్తాము. మాకు సహాయము వెంటనే లభిస్తుంది. అదెలా సాధ్యము?'' శ్రీ భగవాన్ చిరకాల భక్తుడు తమ సన్నిధికి వచ్చి, శ్రీ భగవాన్ దర్శనం చేసుకుని వెళ్ళినప్పటి నుండి తను పడిన కష్టాలన్నీ ఏకరువు పెట్టుకుని శరణు వేడుకుంటాడు.

శ్రీ భగవాన్ అతను చెప్పేదంతా చాలా ఓపికగా వింటూ, మధ్య మధ్యలో ఎంతో సానుభూతితో, 'అలాగా! పాపం' అంటారు. చెప్పాల్సింది అంతా ముగిశాక, భక్తుడు, ఇక యే మార్గము దొరక్క శ్రీ భగవాన్‌తో రక్షణ కోసం మొర పెట్టుకున్నాను. చివరకు శ్రీ భగవానే నన్ను కాపాడారు. ఇదంతా తనకు తెలియనట్లు శ్రీ భగవాన్ శ్రద్ధగా వింటారు. అంతేకాదు, ఈ విశేషాలను హాలులో వచ్చిన భక్తులకు చెబుతారు కూడా! ''మన దగ్గరకు వచ్చిన తరువాత, వారికి యిలా యిలా జరిగిందట'' అని ఆశ్చర్యం ప్రకటిస్తూ చెబుతారు. శ్రీ భగవాన్ ఎప్పుడూ నటించరు. వారికి నిజంగానే ఇవన్నీ జరిగినవని తెలియకపోవచ్చును. అయితే ఒక విషయము మాత్రము సుస్పష్టము. మనకు యేదైనా కష్టము వచ్చి వారిని ఆర్తితో ప్రార్థించినప్పుడు, మనకు వెంటనే ఏదో ఒక రకమైన సహాయము లభిస్తుంది. ఏదైనా కారణం వల్ల, ఆ కష్టము తొలగిపోలేని పరిస్థితులలో, ఆ కష్టాన్ని తట్టుకుని భరించగలిగే శక్తిని ప్రసాదిస్తారు శ్రీ భగవాన్. ఇదంతా నేను శ్రీ భగవాన్ ముందుంచినప్పుడు, వారు, ''అవును అదంతా దానంతట అదే జరిగిపోతుంది,'' అని సెలవిచ్చారు. (ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింపబడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

## అనుస్మరణీయులు

# శ్రీ అయ్యల సోమయాజుల వెంకట రమణ

ఎ. రేణుక

భగవంతుడు ఎల్లవేళలా మనను కాచుకోలేడని మనకి కాపుగా తలిదండ్రులని చూపిస్తాడు. సూర్యచంద్రుల లాంటి వారు ఈ తలిదండ్రులు. తండ్రి సూర్యుడిలా ఆత్మ విశ్వాసాన్ని ఇస్తే తల్లి చంద్రునిలా చల్లగా సేద తీరుస్తుంది.

శ్రీ కావ్యకంఠ వాశిష్ఠ గణపతి శాస్త్రి, శ్రీమతి విశాలాక్షమ్మ గార్ల మనుమడు మరియు శ్రీ మహాదేవ శాస్త్రి, శ్రీమతి రాజేశ్వరమ్మ గార్ల తనయుడు అయిన మా నాన్నగారు శ్రీ అయ్యల సోమయాజులు వెంకట రమణ గారు. మా అమ్మగారు శ్రీమతి విమలా దేవి ఆయన అడుగుజాడల్లో నడిచిన ఉత్తమ ఇల్లాలు. భగవాన్ శ్రీ రమణ మహర్షి పట్ల వీరికి ఉన్న భక్తి, అనుబంధాన్ని మా చిన్నతనంలో మాకు కథలుగా చెపుతూ ఉండేవారు. అందులో కొన్ని సంఘటనలను మీతో పంచుకుంటున్నాను.

మా అమ్మ నాన్నలకు మేము నలుగురు సంతానం. మాకు రోజూ ఉదయం పాలు త్రాగించే సమయంలో, రాత్రి నిద్ర బుచ్చే సమయంలో మా నాన్నగారు, మా తాతగారు, ముత్తాతగారు (నాయన) మరియు భగవాన్ రమణ మహర్షి గురించి కథలు చెప్పే వారు. మా అమ్మగారు చాలా చక్కని గాయని. ఎన్నో కచేరీలు చేసేరు. మాకు నాయన గారు రాసిన గీతాలను రాగయుక్తంగా

పాడటం నేర్పించేవారు. రోజు సాయంత్రం ఆటలు అయిన తరువాత మేము గీత మాలలో గీతాలన్నీ చెప్పుకుని తరువాత స్కూలు పాఠాలు చదువుకునే వాళ్ళం.

నాన్నగారు చిన్నతనం సుమారు 8-9 సంవత్సరాల వయసులో, భగవాన్ శ్రీ రమణుల ఆశ్రమంలో ఆడుకునేవారు. భగవాన్ నడుస్తూ ఉంటే ఆయన ముందు, వెనుకా తిరుగుతూ ఆయన కాళ్లల్లో పడిపోతూ ఉండేవారట. భగవాన్‌కి పిల్లలంటే అమితమైన ప్రేమ, పిల్లలతో సమానంగా ఆడుకునేవారట. ఒక రోజు మా నాన్నగారు తన స్నేహితులతో ఆడుతూ తెలియక కొన్ని సమాధుల పైన ఎగిరి దుమికేరట. మరునాడు నిద్ర లేవగానే కళ్ళ ముందు ఏమీ కనపడక అంతా శూన్యంగా తెల్లగా కనబడసాగింది. మా తాతగారు, నానమ్మ గారు ఎన్ని వస్తువులు చూపించినా కనపడటం లేదని, శూన్యంగా ఉందని అన్నారుట. అప్పుడు వెంటనే ఆశ్రమంలో భగవాన్ వద్దకు తీసుకుని వెళ్లేరుట. అపుడు భగవాన్ నాన్నగారి కళ్ళలోకి చూసి, నుదుటిన విభూతి రాశారుట. అంతే, చటుక్కున అన్నీ మామూలుగా కనబడసాగాయట.

మహాత్ముల సమాధులను అలా పాదాలతో తొక్కరాదంటూ సున్నితంగా మందలించారుట. అప్పటి నుంచీ శ్రీ భగవాన్ కృప ఎల్లప్పుడూ నాన్నగారి మీద ఉండేది.

స్కూల్ ఫైనల్ అవగానే, నాన్నగారికి బి.ఎస్.ఎన్.ఎల్.లో ఉద్యోగం వచ్చింది. ఆ రోజుల్లో ఈ సంస్థని పోస్ట్స్ & టెలిగ్రాఫ్స్ అనేవారు. అప్పటికే నాన్నగారికి వివాహం అయింది. ఉద్యోగరీత్యా

చాలా రాష్ట్రాలలో ముఖ్య పట్టణాలలో పనిచేసేరు. డెహ్రాడూన్‌లో మా చిన్నతనంలో ఉండగా, ప్రతీ ఆదివారం హరిద్వార్ వెళ్లి గంగా నదిలో స్నానం చేసి వచ్చేవాళ్ళం. ఆ తరువాత భువనేశ్వరంలో ఉన్నపుడు, ప్రతీ ఆదివారం, శ్రీ లింగరాజ్ మందిరానికి అమ్మా నాన్న గారు సైకిల్ మీద వెళ్లి వచ్చేవారు. అందువల్ల ఆ గంగమ్మ తల్లి మరియు శివపార్వతుల అనుగ్రహం వలన, యుక్త వయస్సులోనే, చిన్న చిన్న కంద పద్యాలు, సీస పద్యాలు రాయటం మొదలుపెట్టేరు.

భగవాన్ నాయనల గురించి, భువనేశ్వర్ ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్‌లో మన తెలుగు వారందరికీ చెప్పేవారు. నాయన గారి అసంపూర్ణ రచన “పూర్ణ” నవలని ఆయన కుమారుడైన మహాదేశ శాస్త్రి గారు “సత్య ప్రభ” అనే పేరుతో పూర్తి గావించేరు. ఈ సత్యప్రభ నవలని నాటక రూపంలో పిల్లలందరిచేత వేయించారు మా నాన్నగారు. ఈ విధంగా భువనేశ్వర్‌లో అందరికీ వీరి గురించి తెలియచేసేరు.

1983లో ఏలూరుకు అకౌంట్స్ ఆఫీసర్‌గా వెస్ట్ గోదావరి జిల్లాకు ఇన్‌ఛార్జ్‌గా ఉండేవారు. ఆఫీస్‌లో అలవాటు ప్రకారం భగవాన్ ఫోటో కేబిన్‌లో పెట్టుకున్నారు. ప్రమోషన్ మీద పెద్ద బాధ్యత స్వీకరించిన నాన్నగారికి ఆ డివిజన్‌లో అంతకు ముందు నుంచీ ఉన్న సమస్యలు ఎదుర్కోవలసి వొచ్చింది. రకరకాల కోర్ట్ కేసులు ఉండేవి. నాన్నగారికి ముందు అకౌంట్స్ ఆఫీసరగా పనిచేసిన వ్యక్తి ఆ సమస్యల ఒత్తిడికి బ్రెయిన్ హేమరేజ్ వొచ్చి

మరణించారు. కోర్ట్‌కి వెళ్లినపుడు, నాన్నగారితో కూడా ఒక అటెండెంట్ ఎప్పుడూ ఉండేవాడు. వివిధ కేసులకు సంబంధించిన ఫైల్స్ ఆఫీస్ అల్మైరా లోంచి తీయటం పెట్టటం, తాళం వెయ్యటం, నాన్నగారితో కోర్ట్‌కి వెళ్ళటం, చేసేవాడు.

ఒకసారి అతనికి ఎందువలనో ఒక దుర్బుద్ధి కలిగింది. మా నాన్నగారికి తెలీకుండా, ఒక సబ్బు బిళ్ళ మీద అల్మైర తాళాలు అచ్చులు తీసుకుని, డూప్లికేట్ చేయించాడు. తరువాత ఒక సెలవు రోజు, కేబిన్‌లోకి ముఖ్యమైన ఫైల్స్ మాయం చేయడానికి వెళ్లే ప్రయత్నం చేసాడు. కేబిన్ తాళం తీయగానే వేడి సెగలు వచ్చాయిట. ఒళ్ళంతా మంటలు పుట్టి లోనికి వెళ్లలేకపోయాడట. ఎన్నిసార్లు ప్రయత్నించినా లోనికి అడుగు పెట్టలేకపోయెడట. వెంటనే మా ఇంటికి వచ్చి తప్పు ఒప్పుకుని, తనని క్షమించమని వేడుకున్నాడుట. అతన్ని క్షమించి, వేరే డిపార్ట్మెంట్ కి ట్రాన్స్ఫర్ చేయించారట. మరునాడు వేరొక కొత్త అటెండెంట్ వచ్చేడు. ఆశ్చర్యంగా అతని పేరు ''రమణ''... నాన్నగారు, భగవాన్ ఫోటో చూసి, అపారమైన కృపకు కంటతడి పెట్టేరు. ఏలూరులో ఏంతో మందికి ఉద్యోగాలు వేయించేరు. ఇంకా చాలా మంది పేద విద్యార్థులకు సహాయం చేసేరు.

ఒకసారి ఏలూరు లోనే ఉండగా అన్నయ్యకి రీజినల్ ఇంజనీరింగ్ కాలేజీ కురుక్షేత్రలో ఇంజనీరింగ్‌లో సీట్ వచ్చింది. అతన్ని కాలేజీలో దింపి మరునాడు వస్తూ ఉంటే గేట్ దాకా సాగనంపక ముందే సీనియర్ విద్యార్థులు రాగ్గింగ్ చేస్తూ

అన్నయ్యని లాక్కుని వెళ్లిపోయేరు. అది చూసి నాన్నగారు చాలా దిగులు చెందేరు. మరుసటి రోజు నుంచీ ధ్యానం (మెడిటేషన్) చెయ్యటం మొదలు పెట్టేరు. ధ్యానం ద్వారా అన్నయ్యకి కాలేజీలో నిలదొక్కుకునే శక్తిని, ధైర్యాన్ని అందజేశారు. ఈ సమయంలో నేను మా నాన్నగారిని నిద్రలో కన్నా, ధ్యాన ముద్రలోనే ఎక్కువ సమయం చూసేను. అప్పటినుండి చిన్నచిన్న కథలు, వ్యాసాలూ రాయటం మొదలు పెట్టేరు నాన్నగారు. ఏలూరులో రమణ కేంద్రాన్ని మొదలుపెట్టి, ప్రతీ ఆదివారం భగవాన్, నాయనలు రాసిన వివిధ గ్రంథాలని సులువుగా అందరికీ బోధ పరిచేవారు. పాటలు రాస్తే, అమ్మ వాటికి రాగం కట్టి అందరి చేతా పాడించేది.

1990లో ఏలూరు నుండి హైదరాబాద్ ప్రమోషన్ మీద ట్రాన్స్ఫర్ అయి వచ్చారు. వచ్చిన కొద్ది నెలలకే నాన్నగారికి హార్ట్ అటాక్ వచ్చింది. డాక్టర్స్‌కి చూపిస్తే అబ్జర్వేషన్‌లో పెట్టేరు. అమ్మ నాన్నగారికి తోడుగా హాస్పిటల్‌లో ఉండిపోయింది. అన్నయ్య హాస్పిటల్‌కి వెళ్ళటానికి తయారవుతూ, అద్దానికి ఎదురుగా వచ్చేడు. ఆ అద్దానికి ప్రక్కనే భగవాన్ ఫోటో ఉంది. దాని క్రింద టేబుల్ మీద ఒక పాత హిందూ పేపర్ కనపబడింది. యాదృచ్ఛికంగా ఆ పేపర్ మీద దృష్టి మళ్లింది. అందులో హార్ట్ ఎటాక్ కి బైపాస్ సర్జరీ అని ఒక వ్యాసం ఉంది. అంతే అది భగవాన్ ఇచ్చిన సంకేతంగా అనుకుని హాస్పిటల్‌కి వెళ్ళగానే, డాక్టర్స్‌తో డిస్కస్ చేసి బై పాస్ సర్జరీ చేయించటానికి నిర్ణయం తీసుకున్నారు.

ఆ విధంగా ఆపరేషన్ అయినా వెంటనే ఐ.సి.యు.లో ఉంచబడ్డారు. ఆక్సిజన్ పెట్టి కాలు చెయ్యి కూడా కదలలేని పరిస్థితుల్లో బెడ్ మీద ఉన్న సమయంలో సడన్‌గా ఆక్సిజన్ ఎక్కువ రావటం మొదలైంది. ఉక్కిరిబిక్కిరి అవుతూ, నర్సుకు సంజ్ఞ చేసినా వారికి అర్థం కాలేదు. ఇక కళ్ళు మూసుకుని భగవాన్ నామస్మరణ చేసుకుంటూ 'అరుణాచల శివ అరుణాచల శివ' అనుకుంటూ ఉండి పోయేరు. ఏమైందో తెలీదు, కాసేపటికి ఆక్సిజన్ దానంతట అదే సెట్ అయిపోయి ఉపశమనం పొందేరు. ఇది భగవాన్ అనుగ్రహం కాకపోతే మరి ఏమిటి?

ఇది ఇలా ఉంటే, హైదరాబాద్ లోని రమణ సత్సంగంలో చాలా మంది రమణ భక్తులు పరిచయం అయ్యారు. నాన్నగారు అక్కడ కూడా చాలా ప్రసంగాలు చేసేవారు. అమ్మ అందరికీ గీతాలు పాడి వినిపించేది. "రమణ జ్యోతి" అనే మాసపత్రికలో నాయన గారి ఉమాసహస్రం శ్లోకాలకి అర్థం అందరికీ సులువుగా తెలిసేలాగ రాసేవారు. అపుడే ఒక రోజు ఆదివారం సత్సంగంలో మహా రమణ భక్తుడు, జ్ఞాని అయిన డా॥ కె. సుబ్రహ్మణ్యం గారు (కె.ఎస్. గా పిలువబడేవారు) పరిచయం అయ్యారు. ఈ కె.ఎస్. గారు ప్రముఖ దినపత్రిక "ది హిందూ"లో చాలా వ్యాసాలూ, శీర్షికలు ఇంగ్లీష్‌లో రాసేవారు. ఆయన ఒకసారి నాన్నగారితో ఇలా అన్నారు "రమణ గారూ, మీరు నాయన గారి మనుమడు కదా, నాయన గారి చరిత్ర అందరికీ సులువుగా అర్థం అయ్యేట్టు

ఎందుకు రాయకూడదూ?'' అని అన్నారు. అది భగవాన్ ఆజ్ఞగా భావించి, ''మహా తపస్వి'' అనే పుస్తకం రాశారు.

తదనంతరం, ఎన్నో వ్యాసాలూ, పుస్తకాలూ రాశారు. నాయన గారి ''దశ మహా విద్యలు'', ''ఛందోపనిషద్'' వంటి గ్రంథాలకు సులువుగా అర్థం అయ్యేట్టు వ్యాఖ్యానం రాశారు.

నాన్నగారు రాసిన కొన్ని పుస్తకాలు మాత్రమే ముద్రణకి నోచుకున్నాయి. ఆయన ఎప్పుడూ మాతో (పిల్లలతో) అంటూ ఉండేవారు. ''మీ అమ్మే నాకు గురువర్రా, తాను చదివి అనుమతి ఇస్తే నేను ముందుకు సాగిపోతాను''. ప్రతీ పురుషుడి వెనుక ఒక స్త్రీ హస్తం ఉన్నట్టు, మా నాన్నగారి విజయాల వెంట అమ్మ అనుక్షణం ఉంటూ ఉండేది. అలాగే వారి ఇరువురి శిరస్సుల పై భగవాన్ మరియు నాయనల కరుణా కటాక్షాలు ఎల్లప్పుడూ ఉంటూ ఉండేవి.

మా అమ్మగారు బయటకు చాలా నిరాడంబరంగా, శాంతంగా ఎప్పుడూ చిన్న చిరునవ్వుతో కనబడేవారు. ఆమెను మేము ఫిలసాఫికల్ ఎన్సైక్లోపీడియా అనే వాళ్ళం. నాన్నగారు రాసిన రచనల గురించి ఎన్నో పత్రికల్లో ప్రశంసలు వచ్చేయి. అవన్నీ నాకు ఆయన జ్ఞాపకాలుగా మిగిలి పోయేయి. అమ్మా, నాన్నగారు స్వర్గస్తులైనా, మాకు వారు చూపిన దారి ఎన్నడూ మరువలేనిది.

ఓం నమో భగవతే శ్రీ రమణ గణపతయే నమః

## Diseased Mind and Body

Talk 30A

Dr K Subrahmanian

I was planning to go to Bombay today, but last Saturday there was a hemorrhage in my left eye, and so the doctor asked me not to travel. He advised me bedrest for about two to three weeks. There is no medicine for this problem; all that is needed is rest. So, man proposes, and God disposes. Even a small plan cannot materialise without his grace. I was planning to go to Bombay, not for any personal work. For the last six years or so, the Ramana Kendram in Bombay has been asking me to give a couple of talks. Almost every year, I used to say no. This year, I thought that it was not proper to refuse every time, so I accepted. Normally, I don't buy the return ticket, but this time, I bought the return ticket as well. We think that because we are going to some place in connection with Bhagavan's *Jayanthi*, everything will work out according to our will. However, it is not for us to decide; it is for him to decide. If it his will that we should not go, we won't be able to go.

For my eye problem, I had the best of attention, and the best of doctors attending on me. I had a laser treatment at LV Prasad Eye Institute, and subsequently, in Madras. The person in Madras was so kind. It sometimes takes about six months to get an appointment. This doctor said, "Don't worry; you walk in any day you like." The minute I walked in, he attended on me immediately with great love

and affection. He then did the laser treatment for me. Sometimes, things happen that have nothing to do with the competence of people. These things happen because we have to undergo these experiences. At the moment, I am not able to see, or rather I see dimly with my left eye. There is no medicine for this; just some rest. That is what Dr Narasimha Rao said, and also Dr Viswanathan of Sarojini Devi Hospital.

There is no point in getting upset about such situations. This is part of being a human being. The moment we have a body, it has to undergo a lot of things in the course of its journey from birth to death. And along with the body, the mind also undergoes a lot of changes. When we meet, we generally ask one another a question in our language that tells us a lot about our own attitude. In English, we ask, “How are you?” and the answer is, “I am fine.” Here the mind and the body are the same. In our language, we ask, “*Ontlo baaga leda*?” meaning, “Is your body unwell?” That is, we may be all right, but our body may be unwell. That is, the mind is all right, but the body is unwell. In our languages, we are able to make a distinction between the body and the mind. What it means is that if the body is not all right, the mind may or may not be well. During the initial stages, all of us are upset when our body is not well.

The extraordinary thing is that the body consists of a number of limbs. When we talk about our body, we refer to our hands, our legs, the head, the stomach, and everything else. When there is an injury to our hand, our

mouth cooperates. How? The tongue tells the body that there is an injury to the hand, and we must do something about it. We send for a doctor, or we tell somebody about it, and if we don't have anyone, our legs are willing to take the trouble to walk us to the doctor. The fingers will point out the injury. That is, there is tremendous cooperation from the other limbs of the body. If there is a small injury in any part of the body, the entire attention of the body and the mind is on the injury till it heals. In other words, even though we have several limbs, all the limbs cooperate in seeing that the injury is healed. There is tremendous concentration when there is suffering of any kind.

